సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం : 5 : ఆగస్టు : 2025



అద్దె భవనాల్లోనే ఆఫీసులు

ప్రభుత్వానికి ఆదాయ వనరుగా ఉన్న ఆర్టీఓ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె బిల్డింగుల్లోనే నిర్వహిస్తున్నారు. 8లో



అమ్మవారికి శఠగోపం

పెద్దమ్మతల్లి ఆలయం ఆధ్వర్యంలో నిర్మించిన ఏసీ ఫంక్షన్ హాళ్లను తక్కువ ధరకే కట్టబెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
34° / 24°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

రామాలయంలో కియాస్క్ మిషన్ ప్రారంభం



మిషన్‌ను ప్రారంభిస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్ : భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఫెడరల్ బ్యాంక్ వారు అందజేసిన రెండో కియాస్క్ మిషన్‌ను ఈఓ ఎల్.రమాదేవి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భక్తులు ఈ మిషన్‌ను ఉపయోగించుకుని అవసరమైన ప్రసాదాలను పొందవచ్చని తెలిపారు. నిమిషం లోపే టోకెన్ పొంది, ప్రసాదం తీసుకునేలా ఏర్పాటు చేశామని చెప్పారు. కియాస్క్ మిషన్లకు భక్తుల నుంచి విశేష స్పందన వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రవీంద్రనాథ్, ఏఈఓ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు 26 పతకాలు



పోటీలకు జిల్లా నుంచి హాజరైన క్రీడాకారులు

కొత్తగూడెంటౌన్ : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సోమవారం ముగిసిన రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు 26 పతకాలు సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ తెలిపారు. ఈ పోటీలకు జిల్లా నుంచి 40 మంది అథ్లెట్లు హాజరు కాగా, 26 మంది పతకాలు సాధించారని, జిల్లాకు ఆరు బంగారు, 14 రజత, 6 కాంస్య పతకాలు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు యుగంధర్, కార్యదర్శి రాజేందర్ తదితరులు అభినందించారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

పోలీస్ సిబ్బందికి ఎస్పీ సూచన



పోలీస్ అధికారులు, సిబ్బందితో ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంఅర్బన్ : పోలీస్ శాఖలో పని చేసేవారు క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సోమవారం ఆయన ఏఆర్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత అడ్మిన్ ఆర్‌ఐ కార్యాలయంతో పాటు మోటార్ ట్రాన్స్‌పోర్ట్, సంక్షేమ కార్యాలయాలను, హోంగార్డ్ ఆర్‌ఐ ఆఫీసులో రికార్డులను తనిఖీ చేశారు. బాంబు డిస్పోజల్ టీం, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో వినియోగించే సాంకేతికత, శిక్షణను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ప్రజలకు సేవలు అందించడంలో ముందుండాలని అన్నారు. శారీరక, మానసిక దృఢత్వం కోసం నిత్యం వ్యాయామం, యోగా చేయాలని చెప్పారు. అధికారులు, సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎంటీఓ సుధాకర్, హోంగార్డ్, అడ్మిన్, వెల్ఫేర్ ఆర్‌ఐలు నరసింహారావు, లాల్‌బాబు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓగా జెడ్పీ సీఈఓకు అదనపు బాధ్యతలు



నాగలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్ : జిల్లా విద్యాశాఖ అధికారిణిగా జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. డీఈఓ వెంకటేశ్వరాచారి గత నెల 31న ఉద్యోగ విరమణ చేయగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాగలక్ష్మికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వెంటనే ఆమె బాధ్యతలు స్వీకరించారు.

దళారులకు చెక్..



మెడికల్ బోర్డు నిర్వహించే సింగరేణి ప్రధాన ఆస్పత్రి

సింగరేణి మెడికల్ బోర్డుపై ఏసీబీ నజర్

- అనారోగ్యం బారిన పడిన వారే అన్‌ఫిట్
- 54 మందికి పరీక్షలు.. ఐదుగురికే దక్కిన 'వారసత్వం'
- 49 మంది కార్మికులు తిరిగి విధుల్లోకే..
- సంస్థ నిర్ణయాన్ని స్వాగతిస్తున్న కార్మికులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మెడికల్ బోర్డులో అవినీతి వ్యవహారాలు శృతి మించుతున్నాయనే ఆరోపణలు రావడంతో గత ఆరు నెలలుగా సింగరేణి సంస్థ మెడికల్ బోర్డు నిర్వహణపై ఆచితూచి వ్యవహరిస్తోంది. కొత్తగా కార్మికుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించకుండా, గతంలో నిర్వహించిన బోర్డుల్లో సెకండ్ ఒపీనియన్ కోసం హయ్యర్ రిఫరల్ చేసిన కేసులకే ప్రత్యేకంగా జూలై 30, 31 తేదీల్లో మెడికల్ బోర్డు ద్వారా పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. 54 మంది కార్మికులు/ఉద్యోగులను వైద్య పరీక్షల కోసం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రికి పిలవగా 53 మంది హాజరయ్యారు. కాగా, పరీక్షల తర్వాత మెడికల్ బోర్డు వెల్లడించిన ఫలితాలు సింగరేణి వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి.

తొమ్మిది శాతమే..

మెడికల్ బోర్డు ద్వారా అనారోగ్య కారణాల రీత్యా తమను అన్‌ఫిట్ చేసి వారసులకు సంస్థలో ఉద్యోగాలు ఇవ్వాలంటూ 53 మంది కార్మికులు అర్జీ పెట్టుకుంటే.. ఇందులో ఐదుగురే అన్‌ఫిట్‌గా తేలారు. 17 మంది కార్మికులు భూగర్భ గనుల్లో పని చేసేందుకు ఫిట్‌గా లేరని, వీరికి ఉపరితలంలో పని కల్పించాలని సూచించారు. వీరు కాకుండా మిగిలిన 31 మంది కార్మికులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని మెడికల్ బోర్డు తేల్చి చెప్పింది. మొత్తంగా తొమ్మిది శాతం మంది ఉద్యోగులే అన్‌ఫిట్ కావడం గమనార్హం. గతంలో సుమారు 70 శాతం మంది కార్మికులు అన్‌ఫిట్ అయితే, మరో 20 శాతం మందిని హయ్యర్ రిఫరల్‌కు పంపేవారు. వారసత్వ ఉద్యోగాల పేరుతో దళారులు చక్రం తిప్పడం వల్లే మెడికల్ బోర్డు ఫలితాల్లో అన్‌ఫిట్ శాతం ఎక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి.

ప్రక్షాళన బాటలో..

దళారుల అండ లేకుంటే తమ పిల్లలకు ఉద్యోగాలు రావనే అభిప్రాయం కార్మికుల్లో బలపడింది. దీంతో కాయకష్టం చేసి ఆర్జించిన సొమ్ముతో పాటు అప్పు చేసి దళారుల జేబులు నింపడం పరిపాటిగా మారింది. 'కారుణ్య నియామకాలు – అవినీతి దందా'పై వరుసగా వార్తా కథనాలు రావడం, సంస్థ ప్రతిష్టకు మచ్చగా నిలుస్తుండడంతో ఈ ఏడాది జనవరి నుంచి సింగరేణి యాజమాన్యం ఈ అంశంపై ఫోకస్ పెట్టింది. సంస్థ పరంగా విజిలెన్స్ నిఘా పెంచడంతో పాటు ఏసీబీకి విచారణ బాధ్యతలు అప్పగించింది. ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక వాట్సాప్ నంబర్‌తో పాటు ఈ మెయిల్ అడ్రస్‌ను సీఎండీ బలరామ్ నాయక్ అందుబాటులోకి తెచ్చారు. ఈ చర్యల ఫలితమే గడిచిన కొన్ని నెలలుగా సింగరేణి కేంద్రంగా జరుగుతున్న ఏసీబీ అరెస్టులు. తాజాగా 54 మంది కార్మికులకు మెడికల్ బోర్డు నిర్వహిస్తే ఇందులో ఐదుగురు కార్మికులే అన్‌ఫిట్ అయ్యారు. ఈ మార్పుతో మెడికల్ బోర్డు దళారీ వ్యవస్థ గప్‌చుప్ అయింది. మార్చి తర్వాత మెడికల్ బోర్డు పెట్టడం లేదంటూ నిన్నా మొన్నటి వరకు సన్నాయి నొక్కులు నొక్కిన వారు ఇప్పుడు కిమ్మనడం లేదు. మరోవైపు బోర్డులో అవినీతి ప్రక్షాళనపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాడు దళారులదే రాజ్యం..

ఒకప్పటి ఆనవాయితీ కొనసాగిస్తూ సింగరేణి కార్మికుల పిల్లలకు వారసత్వ ఉద్యోగాలు కల్పించేందుకు ఇచ్చిన వెసులుబాటు.. మెడికల్ బోర్డును అవినీతికి కేరాఫ్‌గా మార్చింది. కారుణ్య నియామక కోటాలో వారసత్వ ఉద్యోగాలు కల్పించేందుకు నిర్వహించే అనారోగ్య పరీక్షలు, ఆ తర్వాత జరిగే తంతులో దళారులు ప్రవేశించారు. గని స్థాయిలో సంక్షేమాధికారికి దరఖాస్తు చేయడానికి ముందే ఈ వ్యవహారంలో చొరబడి.. కీలకమైన అనారోగ్య పరీక్షలు నిర్వహించే మెడికల్ బోర్డు వరకు అంతా తామే చూసుకుంటామంటూ కార్మికులకు మాయమాటలు చెప్పేవారు. ఒక కార్మికుడిని అనారోగ్య కారణాలతో అన్‌ఫిట్ చేయించి అతడి వారసుడికి ఉద్యోగం ఇప్పించేందుకు కనీసం రూ.5లక్షల నుంచి రూ. 8లక్షల వరకు చేతులు మారడం సర్వసాధారణ వ్యవహారంగా నిలిచింది. ఈ దళారుల దందాకు ఆరంభంలోనే బ్రేకులు వేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం పొరపాటుగా పరిణమించింది.

రక్తదానంతో ప్రాణ రక్షణ



మణుగూరుటౌన్ : రక్తదానం చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి
- మణుగూరు 100 పడకల ఆస్పత్రిలో రక్త నిల్వల కేంద్రం ప్రారంభం

మణుగూరు టౌన్: ఒక యూనిట్ రక్తదానంతో ఇతరుల ప్రాణాలకు రక్షణ కల్పించొచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మణుగూరు 100 పడకల ఆస్పత్రిలో రక్త నిల్వ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డుల్లో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. గర్భిణులు, తలసేమియా, సికిల్ సెల్ అనీమియా వంటి వ్యాధులతో బాధపడే వారు, ప్రమాదాల్లో గాయపడిన వారు రక్తం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే రక్త నిల్వ కేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ సంవత్సరానికి రెండుసార్లు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఆస్పత్రిలో వైద్య పోస్టుల భర్తీకి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం కలెక్టర్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ రవిబాబు, సూపరింటెండెంట్ సునీల్, తహసీల్దార్ నరేశ్, ఎంపీడీఓ శ్రీనివాస్, సాయిమోహన్, గౌరి పాల్గొన్నారు.

ఉన్నత ఆలోచనలతో ముందుకు సాగండి..



కరకగూడెం కేజీబీవీలో మాట్లాడుతున్న కలెక్టర్..

కరకగూడెం: విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమని, విద్యార్థులంతా ఉన్నత ఆలోచనతో ముందుకు సాగాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పిలుపునిచ్చారు. మండలంలోని భట్టుపల్లి కేజీబీవీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. బోధన ఎలా ఉంది, సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో నెలకొన్న సమస్యలను నోట్ చేసుకుని, పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు కేటాయించిన ఎస్‌ఎస్‌ఏ నిధులు రూ.5లక్షలతో అవసరమైన పనులు చేయించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో మునగ, కరివేపాకు, ఉసిరి మొక్కలు నాటాలని, విద్యార్థులకు ఔషధ మొక్కలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కరకగూడెం జెడ్పీ పాఠశాలను పరిశీలించారు. త్వరలో నవోదయ పాఠశాల ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంఈఓ మంజుల, విద్యాశాఖ ఏఈ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ కాంతయ్య, ఎంపీఓ మారుతీ యాదవ్, కేజీబీవీ ఎస్‌ఓ శ్రీదేవి, ఆర్‌ఐ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ..

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం తనిఖీ చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఆయన వెంట ఎన్నికల సూపరింటెండెంట్ రంగాప్రసాద్, సిబ్బంది నవీన్ ఉన్నారు.

ప్రజావాణికి తగ్గిన జనం



ఫిర్యాదుదారులు లేక ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి గతంలో జనం పోటెత్తేవారు. కానీ రాను రాను ఈ కార్యక్రమానికి ఫిర్యాదుదారులు తగ్గుతున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరం కావడంతో పాటు కలెక్టర్ ప్రజావాణికి హాజరయ్యారా లేదా అని ఫోన్‌లో తెలుసుకుంటున్నారు. ఆయన లేరని తెలిస్తే ఆ రోజు ఎక్కువ మంది రావడం లేదు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకోవాలనే సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ నిత్యం ఏదో ఒక ప్రాంతానికి వెళుతున్నారు. దీంతో ఆయన ప్రజావాణికి రాలేకపోతున్నారని అధికారులు చెబుతున్నారు. అయితే వారంలో ఒక పూట మాత్రమే నిర్వహించే ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తే తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో వస్తున్న వారు కలెక్టర్ లేకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. పలువురు అధికారులు సైతం శాఖా పరమైన పనుల నిర్వహణతో ప్రజావాణికి హాజరు కావడం లేదు. సోమవారం జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్‌తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయండి

ఇల్లెందు మున్సిపాలిటీ 19వ వార్డు గోవింద్ సెంటర్‌కు చెందిన ప్రజలు.. తాము 40 సంవత్సరాలుగా స్థానిక రైల్వే స్థలంలో ఉంటూ ఇంటి పన్నులు, తాగునీటి పంపు బిల్లులు చెల్లిస్తున్నామని, పేదరికంలో ఉన్న తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఆన్‌లైన్‌లో తమ పేర్లు మొదటి లిస్టులో వచ్చాయని, రైల్వే స్థలమనే కారణంతో ఇళ్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

కొత్తగూడెం కార్పొరేషన్ చిట్టి రామవరం 19వ డివిజన్ వాసులు తమకు పోడు పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. గరీబ్‌పేట పంచాయతీ అంబేద్కర్ నగర్ బీట్‌లోని అటవీ భూమిని 45 ఏళ్లుగా పోడు చేసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పోడు భూములకు పట్టాలివ్వాలని ఆదేశించినందున తమకు కూడా జారీ చేయాలని కోరారు. ఈ మేరకు సీపీఐ నాయకులు బానోత్ చందర్, బానోత్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో రైతులు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి

జూలూరుపాడు: మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. జూలూరుపాడు పీహెచ్‌సీని సోమవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, ప్రసవాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో అన్ని అంశాల్లో 100 శాతం లక్ష్యం సాధించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆశ కార్యకర్తల సాయంతో ప్రతీ గ్రామంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో మునగ మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేశ్వర్లు, డాక్టర్ తేజస్విని, సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ, స్టాఫ్‌నర్సు సుకుమారి, ఫార్మసిస్టు జి.శశికళ, ఎల్‌టీ జగదీష్ పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలు అమలు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యక్రమాలు సమర్థంగా అమలు చేయాలని డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి అన్నారు. తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సికిల్‌సెల్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అదనంగా పోషక విలువలు అందించడంతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కల్పించే మునగ విశిష్టతను వివరించారు. సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు పుల్లారెడ్డి, తేజశ్రీ, ఎండీ ఫైజ్ మోహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నవజాత శిశువులకు రెటినోపతి ఆఫ్ ప్రిమెచ్యూరిటి కార్యక్రమం అమలుపై జిల్లా ఇన్‌చార్జ్ సుభద్రతో సమావేశం నిర్వహించారు.

రెండేళ్లుగా సా..గుతూ !

- అమృత్ భారత్ పనుల్లో జాప్యం
- 60 శాతం మాత్రమే పూర్తయ్యాయని అంచనా
- పనుల వివరాలు వెల్లడించేందుకు రైల్వే అధికారుల నిరాకరణ
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



కొత్తగూడెం స్టేషన్‌లో పూర్తి కాని ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

కొత్తగూడెంఅర్బన్: అమృత్ భారత్ పథకానికి భద్రాచలం రోడ్(కొత్తగూడెం) రైల్వే స్టేషన్ ఎంపికై మంగళవారానికి రెండేళ్లు పూర్తయింది. ఈ పథకం కింద స్టేషన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు ప్లాట్‌ఫాంపై రేకుల షెడ్‌లు మినహా మిగిలినవన్నీ నత్తనడకనే సాగుతున్నాయి. అయితే ఈ పథకం కింద ఏయే పనులు చేస్తున్నారు, అవి ఎంతవరకు పూర్తయ్యాయి, ఎన్ని నిధులు ఖర్చు చేశారు అనేది పర్యవేక్షించే బాధ్యత ఐఓడబ్ల్యూ విభాగం అధికారులదే. అయితే ఆ విభాగం అధికారిని సంప్రదిస్తే తన వద్ద ఎలాంటి సమాచారం లేదని, డోర్నకల్ లేదా సికింద్రాబాద్ అధికారులను అడగాలని అంటున్నారు. కనీసం వారి ఫోన్ నంబర్లు కూడా తనకు తెలియదని చెప్పడం గమనార్హం.

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు..

పనుల్లో జాప్యంతో పాటు రైల్వే స్టేషన్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్లాట్‌ఫాంపై రేకుల షెడ్‌లు లేక ఎండ, వానల్లోనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వెయిటింగ్ హాళ్లు పూర్తి కాకపోవడంతో ఎక్కడ కూర్చోవాలో తెలియడం లేదని వాపోతున్నారు. కొందరు ప్రయాణికులు స్టేషన్ ఆవరణలో ఉండే ఆటోలు, కార్లలో, ఫుట్ ఓవర్ బ్రిడ్జిపైన వేచి ఉంటున్నారు. అమృత్ భారత్ పథకంతో అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నా.. ఇక్కడ మాత్రం ఉన్న వసతులు కూడా తొలగించారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

60 శాతం మేరకే పనులు..

అమృత్ భారత్ పథకం కింద 2023 ఆగస్టు 5న భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌ను ఎంపిక చేశారు. అభివృద్ధి పనుల కోసం రూ.25.41 కోట్లు కేటాయించారు. అయితే నాడు ప్రారంభించిన పనులు ఇంకా కొనసా..గుతూనే ఉన్నాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నెలల తరబడి జాప్యం చేయడం, రైల్వే అధికారులు వారితో చర్చలు జరిపి పనులు ప్రారంభించేసరికి జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు 60 శాతం మేర మాత్రమే పనులు పూర్తయ్యాయని తెలుస్తోంది. కొత్తగూడెం కార్పొరేషన్‌గా మారిన తర్వాత రైలు ప్రయాణికుల సంఖ్య కూడా పెరుగుతోంది. కానీ అందుకు తగ్గట్టుగా సౌకర్యాలు లేకపోవడంతో స్టేషన్ అధికారుల తీరుపై ప్రయాణికులు మండిపడుతున్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.25.41 కోట్లు కేటాయించగా, పూర్తయిన పనుల వివరాలను అధికారులు సర్కారుకు పంపితేనే నిధులు విడుదలవుతున్నాయి. ఇంకా విద్యుదీకరణ, వెయిటింగ్ హాళ్లు, ఎస్కలేటర్, లిఫ్ట్ పనులు పూర్తి కాలేదు.

పనులు వేగవంతం చేయాలి



భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులు వేగవంతం చేయాలని, ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సమావేశంలో కోరాం. ప్రస్తుతం కూడా రైల్వే స్టేషన్ ఏఓను కలిసి పనులు ఎంత వరకు జరిగాయనే వివరాలు సేకరిస్తున్నాం. పనుల వేగవంతానికి చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరెడ్డి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్

భారీగా తగ్గిన విద్యుత్ డిమాండ్

- పగటి వేళ బ్యాక్‌డౌన్‌లో కేటీపీఎస్ యూనిట్లు
- 6వ దశలో పది రోజులుగా రిజర్వ్ షట్‌డౌన్‌లో 500 మెగావాట్లు



పాల్వంచలోని కేటీపీఎస్ కర్మాగారం

పాల్వంచ: ఇటీవల కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గింది. దీనికి తోడు సోలార్, జల విద్యుత్ సైతం అధికంగా వస్తుండడంతో థర్మల్ విద్యుత్‌ను అంతంతగానే వాడుతున్నారు. ఈ క్రమంలో పాల్వంచలోని కేటీపీఎస్ కర్మాగారంలో తరచూ బ్యాక్‌డౌన్, రిజర్వ్ షట్‌డౌన్‌లో యూనిట్లను ఉంచుతున్నారు. కేటీపీఎస్ 5,6,7 దశల కర్మాగారాల్లో మొత్తం 1,800 మెగావాట్లకు గాను మధ్యాహ్నం 800 మెగావాట్లు మాత్రమే ఇక్కడ ఉత్పత్తిని రాష్ట్ర గ్రిడ్‌కు తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది.

పగలు అరకొరగా.. రాత్రి ఫుల్ లోడ్

పగలు విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉండడంతో పాటు సోలార్ ఉత్పత్తిని వినియోగిస్తుండడంతో కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలోని 800 మెగావాట్లకు గాను 450 మెగావాట్లు మాత్రమే తీసుకుంటున్నారు. మిగితాది బ్యాక్‌డౌన్‌లో ఉంచుతున్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఫుల్ లోడ్ తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా కేటీపీఎస్ 5వ దశలోని 8వ యూనిట్ 250 మెగావాట్లలో ఉదయం 175 మెగావాట్లు, సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు ఫుల్ లోడ్ తీసుకుంటున్నారు. 9వ యూనిట్ 250 మెగావాట్లు, 6వ దశలోని 10వ యూనిట్‌ను గత నెల 25 నుంచి రిజర్వ్ షట్‌డౌన్‌లో ఉంచి పూర్తిగా ఉత్పత్తి నిలిపివేశారు. కాగా 9వ యూనిట్‌లో సుమారు పది రోజుల అనంతరం సోమవారం ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకొచ్చారు.

డిమాండ్ లేకే ఉత్పత్తి తగ్గిస్తున్నాం



పగలు విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉండడంతో పాటు సోలార్ ఉత్పత్తిని అధికంగా వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని యూనిట్లను పగలు బ్యాక్‌డౌన్‌లో ఉంచి, రాత్రి ఫుల్ లోడ్ తీసుకుంటున్నారు. ఇక 9, 10 యూనిట్లు గత పది రోజులు పూర్తి స్థాయిలో ఉత్పత్తిని నిలిపివేసి రిజర్వ్ షట్‌డౌన్‌లో ఉంచాం.

– ఎం.ప్రభాకర్ రావు, 5, 6వ దశల సీఈ

క్లుప్తంగా

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



గర్భిణికి సీమంతం చేస్తున్న స్వర్ణలత లెనినా

అశ్వారావుపేటరూరల్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలే పట్టాలని డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనినా సూచించారు. సోమవారం అశ్వారావుపేటలోని గెస్ట్‌హౌస్ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అశ్వారావుపేట సెక్టార్ పరిధిలో ఏడు నెలలు నిండిన పిల్లలకు అదనపు ఆహారం అందించి, అన్నప్రాసన చేశారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. వయస్సుకు తగిన బరువు ఉన్న పిల్లలను గుర్తించి బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం అమ్మ సేవా సదనంతోపాటు పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సీడీపీవో ముత్తమ్మ, సూపర్‌వైజర్లు ఇమ్మడి పద్మావతి, సౌజన్య, రమాదేవి, వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రయాణికుల నిజాయితీ



బాధితుడికి పర్సు అప్పగిస్తున్న ఎస్‌ఐ ప్రసాద్ తదితరులు

బూర్గంపాడు: ఖమ్మం జిల్లా కొణిజర్లకు చెందిన పెరిక రోశయ్య, చల్లా లక్ష్మీనారాయణ, బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు గ్రామానికి చెందిన బాదావత్ లలిత సోమవారం ఆటోలో వెళ్తున్న క్రమంలో నాగినేనిప్రోలు రెడ్డిపాలెం వద్ద పర్సు కనిపించింది. ఆటో ఆపి పర్సును తీసి పరిశీలించగా, రూ.16వేల నగదు, ఆధార్‌కార్డు ఉన్నాయి. ముగ్గురు వ్యకులు పర్సును పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు ఆధార్‌కార్డు ఆధారంగా బాధితుడిని రప్పించి అందజేశారు. బూర్గంపాడు నుంచి భద్రాచలం వెళ్తున్న క్రమంలో జేబులో నుంచి పర్సు జారిపడిందని బాధితుడు, ఆటోడ్రైవర్ మాడుగుల ప్రశాంత్ తెలిపాడు. నిజాయితీ చాటుకున్న ముగ్గురు వ్యక్తులను ఎస్‌ఐ మేడ ప్రసాద్ అభినందించారు.

కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

కరకగూడెం: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు తెలంగాణ ప్రీమియర్ లీగ్ కబడ్డీ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 9 వరకు హైదరాబాద్‌లో జరిగే పోటీలకు తోలెం ప్రసాద్, బాలకృష్ణ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు. కాగా వీరు గతంలో ప్రో కబడ్డీ లీగ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

చండ్రుగొండ: పోలీసులు సోమవారం వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని అయన్నపాలెం గ్రామానికి చెందిన నల్లగట్ల ఆశాకు ఖమ్మం అల్లీపురం గ్రామానికి చెందిన నాగేంద్రబాబుతో 2022లో వివాహం జరిగింది. దంపతులకు ఇద్దరు సంతానం కలిగారు. కొంతకాలంగా భర్త నాగేంద్రబాబు, అత్త నాగమ్మ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లాడ్జీలో హైదరాబాద్ పోలీసుల తనిఖీలు!

భద్రాచలంటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ లాడ్జీలో మైనర్లకు రూమ్ ఇచ్చిన ఘటనలో హైదరాబాద్ పోలీసులు తనిఖీలు చేసినట్లు సమాచారం. వారం రోజుల క్రితం హైదరాబాద్‌కు చెందిన బాలుడు, బాలిక పట్టణంలోని ఓ లాడ్జీలో బస చేసినట్లు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడి పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం వచ్చి విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయమై స్థానిక పోలీసులకు ఎటువంటి సమాచారం లేదని సీఐ నాగరాజు తెలిపారు.

20 తులాల బంగారం చోరీ

కొత్తగూడెంటౌన్: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రుద్రంపూర్ నాలేరియాకు చెందిన సింగరేణి ఉద్యోగి వి.వెంకటరమణ ఇంట్లో 20 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు చోరీ జరిగింది. సీఐప్రతాప్ కథనం ప్రకారం... వెంకటరమణ జీఎం కార్యాలయంలో క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఆమె సోమవారం ఉదయం విధులకు వెళ్లి సాయంత్రం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో పరిశీలించగా దొంగలు బీరువాను పగులగొట్టి 20 తులాల బంగారం, రూ.2 లక్షల నగదును చోరీ చేశారు. స్థానికుల సమాచారంతో క్లూస్ టీంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. ఫ్యూస్ బస్తీలో నిర్మాణంలో ఉన్న ఇంటి అవసరాల కోసం దాచి ఉంచిన బంగారం, నగదు అపహరించారని బాధితురాలు ఆవేదనవ్యక్తం చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

అద్దె భవనాలే..

ఆదాయం సమకూరుస్తున్నా

- జిల్లాలో సొంత భవనాల్లేని ఆర్టీఓ కార్యాలయాలు
- జిల్లా కేంద్రంతోపాటు భద్రాచలంలోనూ అదే పరిస్థితి
- కొత్తగూడెంలో 20 ఏళ్లుగా సింగరేణి క్వార్టర్‌లోనే నిర్వహణ
- స్థలం కేటాయించినా నిధులివ్వని ఆర్టీఏ ఉన్నతాధికారులు



అద్దెభవనంలో కొనసాగుతున్న భద్రాచలం రవాణాశాఖ కార్యాలయం



కొత్తగూడెం రైటర్‌బస్తీలోని సింగరేణి క్వార్టర్‌లో నిర్వహిస్తున్న జిల్లా రవాణాశాఖ కార్యాలయం

కొత్తగూడెంటౌన్: రవాణాశాఖ ప్రభుత్వానికి ముఖ్యమైన ఆదాయ వనరుగా ఉంది. కానీ ఆ శాఖ కార్యాలయాలు మాత్రం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. జిల్లాలో కొత్తగూడెం, భద్రాచలంలలో ఆర్టీఓ కార్యాలయాలు ఉండగా, రెండూ అద్దె భవనాల్లోనే ఉన్నాయి. అద్దె భవనాల్లోనే అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. నెలకు రూ. లక్షల్లో ఆదాయం గడిస్తున్నా జిల్లా రవాణాశాఖకు ఇప్పటివరకు సొంత భవనం లేదు. 20 ఏళ్లుగా అద్దె చెల్లిస్తూ సింగరేణి క్వార్టర్‌లో కార్యాలయాన్ని నెట్టుకొస్తున్నారు.

పేరు నమోదు ఒకచోట.. టెస్ట్ మరో చోట

రైటర్‌బస్తీ సమీపంలోని జిల్లా కోర్టు భవనాల సముదాయం వెనుక భాగంలో ఉన్న సింగరేణి సంస్థకు చెందిన క్వార్టర్‌లో జిల్లా రవాణాశాఖ కార్యాలయం ఉంది. ప్రస్తుతం ప్రతీ నెల అద్దె చెల్లిస్తూ అధికారులు, సిబ్బంది విధులను నిర్వహిస్తున్నారు. కొత్తగూడెం, భద్రాచలంలతో పాటు అశ్వారావుపేటలో డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్లు ఉన్నాయి. వాహనాల ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్, లైసెన్స్, ట్రాన్స్‌పోర్ట్ పర్మిషన్ తదితర అవసరాల కోసం నిత్యం వందల మంది వాహనదారులు ఆర్టీఓ కార్యాలయానికి వస్తుంటారు. ఈ భవనం పాతది కావడంతో ఇబ్బందులు కూడా ఎదురవుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. డ్రైవింగ్ టెస్టు కోసం కార్యాలయానికి కిలోమీటర్ ఉన్న రామవరంలోని డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌కు వెళ్లాల్సి ఉంటుంది. కొత్తగూడెంలోని జిల్లా కార్యాలయంలో పేరు నమోదు చేసుకుని టెస్టింగ్ కోసం వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

స్థలం కేటాయించినా..

జిల్లా రవాణాశాఖ కార్యాలయ భవనం, డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌ల నిర్మాణానికి 2016లో ప్రభుత్వం రామవరం సీఆర్‌పీ క్యాంప్ సమీపంలో దాదాపు 8 ఎకరాల స్థలం కేటాయించింది. కానీ ఇప్పటివరకు అక్కడా పునాది రాయి కూడా వేయలేదు. బడ్జెట్ సమస్య వల్లే ఆలస్యమవుతోందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీఏ ఉన్నతాధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి, సొంత భవనాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

రవాణాశాఖకు సొంత భవనం ఉండాలి...



ఆర్టీఓ జిల్లా కార్యాలయానికి సొంత భవనం లేకపోవడం బాధాకరం. కొత్తగూడెం, భద్రాచలంలో ఆర్టీఓ కార్యాలయాలను శాశ్వత భవనాలు నిర్మించాలి. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి. – గుత్తుల శ్రీనివాస్, సీపీఐ నాయకుడు

దూరదూరంగా..



జిల్లా కార్యాలయం రైటర్ బస్తీలో ఉంటే, రామవరంలో డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ కేంద్రం ఉంది. రెండు దూరదూరంగా ఉన్నాయి. రెండు ఒకేచోట ఏర్పాటు చేస్తే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది. అధికారులు పట్టించుకోవాలి. –ఎండీ జావిద్, వాహనదారుడు

ప్రతిపాదనలు పంపాం



రామవరం సీఆర్‌పీక్యాంప్ సమీపంలో జిల్లా రవాణాశాఖకు దాదాపు 8 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. కానీ బడ్జెట్ కేటాయించలేదు.కొత్తగూడెంతోపాటు భద్రాచలంలోనూ సొంత భవనాలు నిర్మించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. – వి.వెంకటరమణ, జిల్లా ఇన్‌చార్జ్ ఆర్టీఓ

అమ్మవారికి శఠగోపం!

- పెద్దమ్మగుడి ఏసీ ఫంక్షన్ హాళ్లకు వేలంపాట
- పోటీ లేదంటూ అతి తక్కువ ధరకే కట్టబెట్టిన ఆలయ అధికారులు
- గతేడాది కంటే రూ. 31 లక్షలు మైనస్
- కొబ్బరి చిప్పలకు పెరిగిన రూ.1.80 లక్షల ఆదాయం



పెద్దమ్మగుడి వద్ద వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: అమ్మవారి ఆలయానికి ఆదాయం పెరిగే అవకాశం ఉన్నా ఎండోమెంట్ అధికారులు మాత్రం ఫంక్షన్ హాళ్లకు తక్కువ ధరకే కట్టబెట్టారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో సోమవారం వ్యాపార దుకాణాలు, ఫంక్షన్ హాళ్లకు ఉమాసోమలింగేశ్వరస్వామి ఆలయ ఈఓ వీఎల్‌వీ వెంకట్రావు పర్యవేక్షణలో టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహించారు. భక్తులు అమ్మవారికి సమర్పించిన కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు ఏడాది కాలానికి భద్రాచలానికి చెందిన ఎస్.వెంకట చెంచు సుబ్బారావు రూ.17,01,000 లక్షలకు దక్కించుకున్నారు. గతేడాది ఇదే కొబ్బరి చిప్పలకు రూ.15.20 లక్షలు వచ్చాయి. ఈసారి రూ.1.80 లక్షల ఆదాయం అదనంగా పెరిగింది.

ఫంక్షన్ హాళ్లకు తక్కువ పాట

700 సీటింగ్ కెపాసిటీ కలిగిన ఏసీ ఫంక్షన్ హాల్ ఏడాదికి రూ.26 లక్షల 55వేలకు పాల్వంచకు చెందిన ఆకుల ఆనంద్ దక్కించుకున్నారు. గతేడాది ఇదే హాల్‌కు వేలంపాటలో రూ.40 లక్షల 4 వేలు వచ్చాయి. ఈసారి మాత్రం రూ.13 లక్షల 49 వేల ఆదాయం తగ్గింది. 500 సీటింగ్ సామర్థ్యం కలిగిన మరో ఏసీ ఫంక్షన్‌హాల్ ఏడాదికి రూ.16.20 లక్షలకు కాంపెల్లి కనకేష్ దక్కించుకున్నారు. ఇదే ఫంక్షన్‌హాల్ గతేడాది రూ.34 లక్షల 2వేలు పలికింది. ఈసారి రూ.16 లక్షల 20వేలకు ఇవ్వడంతో ఆలయానికి రూ.18 లక్షల 32 వేల ఆదాయం తగ్గింది. రెండు ఫంక్షన్ హాళ్లపై ఈ ఏడాది అమ్మవారి ఆలయం సుమారు రూ. 31 లక్షల ఆదాయం కోల్పోయింది. ఇంత తక్కువకు రెండు ఫంక్షన్ హాళ్లను అప్పగించడం భక్తుల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై ఈఓ రజనీకుమారిని వివరణ కోరగా.. మూడు, నాలుగుసార్లు టెండర్లు పిలిచినా పాట దారులు ఎవరూ ముందుకు రాలేదని, చివరిగా తగ్గించి వారికి కేటాయించామని చెప్పుకొచ్చారు. కాగా ఒకటో నంబర్ దుకాణానికి పాటదారులు ఎవరూ ముందుకురాని కారణంగా వాయిదా వేసినట్లు పెద్దమ్మగుడి ఈఓ రజనీకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, సభ్యులు పాపారావు, శ్రీను, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సబ్‌కలెక్టర్



సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాచలం సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మ్రిణాల్ శ్రేష్ఠ సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

10న ఉమ్మడి జిల్లా టీ.టీ. జట్ల ఎంపిక

కొత్తగూడెంటౌన్: ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 10 తేదీన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉమ్మ డి జిల్లా అధ్యక్షుడు బాలసాని విజయ్ తెలి పారు. 11 – 19 ఏళ్ల వయసు కలిగిన బాలబాలికలతో పాటు ఓపెన్ విభాగంలో పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఖమ్మంలో జరిగే రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీల్లో పాల్గొనేందుకు జట్లను ఎంపిక చేయనుండగా ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈనెల 10న ఉదయం 9గంటలకు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ఒక పాస్‌పోర్టు సైజు ఫొటోతో పటేల్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు కార్యదర్శి 98484 08335 నంబర్‌లో సంప్రదించాలని విజయ్ తెలిపారు.

నేటి నుంచి రాజీవ్ ట్రోఫీ

ఖమ్మం స్పోర్ట్స్: రాజీవ్ స్మారక అండర్–12, 14, 16 క్రికెట్‌పోటీలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. అండర్–12 ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో, అండర్–14 కొత్తగూడెంలో, అండర్- 16 బాలుర క్రికెట్ పోటీలు కల్లూరు మినీ స్టేడియంలో నిర్వహిస్తామని టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డీ.మతిన్ తెలిపారు. ఇప్పటికే పలు జట్ల బాధ్యులు పేర్లు నమోదు చేసుకోగా, ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యాన టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు చేశామని వెల్లడించారు.

45 కేజీల గంజాయి స్వాధీనం

ముగ్గురు నిందితుల అరెస్ట్, కారు సీజ్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఇల్లెందు: భద్రాచలం, ఇల్లెందుల మీదుగా ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను కథనం ప్రకారం.. ఎస్‌ఐ పి.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది సోమవారం బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం నుంచి మహారాష్ట్రకు కారులో తరలిస్తున్న 45 కేజీల గంజాయిని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం కోట్యాతండాకు చెందిన తేజావత్ శంకర్, తేజావత్ జమ్ముక, సూర్యాపేట జిల్లా రాజునాయక్ తండాకు చెందిన అంగోతు సంతుగా తేలింది. నిందితులను అరెస్ట్ చేసి, కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు 22.62 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న ఒడిశాకు చెందిన రాము, తాతారావు, మహారాష్ట్రకు చెందిన హరిబాబు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, నిందితులను ముగ్గురిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. సీఐ టి. సురేష్, ఎస్‌ఐ పి. శ్రీనివాస రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

‘వన్యప్రాణి సంరక్షణ’ సమావేశంలో ఎమ్మెల్యేలు



సమావేశంలో మంత్రులతోపాటు పాల్గొన్న ఎమ్మెల్యేలు పాయం, కోరం తదితరులు

మణుగూరు టౌన్: వన్యప్రాణుల సంరక్షణ, మౌలిక సదుపాయాల ప్రాధాన్యతలపై హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సోమవారం రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డు సమావేశం నిర్వహించారు. సమావేశం మంత్రులు కొండా సురేఖ, సీతక్క అధ్యక్షతన జరగ్గా పినపాక, ఇల్లెందు ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య తదితరులు హాజరయ్యారు. ఎకో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక సఫారీ వాహనాలకు అనుమతి లభించిందని ఎమ్మెల్యే పాయం తెలిపారు.

రెండు రోజుల్లో కుమారుడి పెళ్లి..

అనారోగ్యంతో తండ్రి మృతి



వీరభద్రరావు(ఫైల్)

పాల్వంచ: రెండు రోజుల్లో కుమారుడి వివాహం జరగాల్సి ఉంది. అంతలోనే తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... పాల్వంచ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన రిటైర్డ్ పోస్ట్‌మాన్ నంది వీరభద్రరావు(63) కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. కాగా అతని చిన్న కుమారుడి వివాహం బుధవారం జరగాల్సి ఉంది. ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీరభద్రరావు ఆరోగ్యం క్షీణించి మృతి చెందడంతో వివాహం వాయిదా పడింది. శుభకార్యం జరగాల్సిన ఇంట్లో విషాదం నెలకొంది.

డెంగీతో మహిళ మృతి

మణుగూరు రూరల్: డెంగ్యూ జ్వరంతో సోమవారం ఓ మహిళ మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ విద్యానగర్ కాలనీకి చెందిన నాయిని సైదమ్మ(55) ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించి ఒక్కసారిగా పల్స్ రేట్ పడిపోవడంతో మృతి చెందింది. కాగా డెంగ్యూ జ్వరంతోనే సైదమ్మ మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యుత్ మోటార్ చోరీ

జూలూరుపాడు: మండలంలోని దండుమిట్టతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యుత్ మోటార్ ఆదివారం రాత్రి చోరీకి గురైంది. పాఠశాలలోని బోరు బావికి అమర్చిన మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించగా, సోమవారం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం గోపాల్ తెలిపారు. విద్యుత్ మోటార్ విలువ రూ. 10 వేలు ఉంటుందని పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం కాలనీ గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.3,790 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యయాతీ రాజు తెలిపారు. గత నెల 31న కొత్త మామిళ్లవారిగూడెంశివారు పామాయిల్ తోటలో పేకాట ఆడుతూ పట్టుబడ్డ ఆరుగురు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసి, సోమవారం తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ ఎదుట హాజరు పరిచామని ఎస్సై వెల్లడించారు.

విద్యుత్ నియంత్రికలు ధ్వంసం

కరకగూడెం: మండల పరిధిలోని సింగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకం విద్యుత్ నియంత్రికలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, రాగి తీగ అపహరించారు. మోటార్లు వేసేందుకు సోమవారం ఉదయం లిఫ్టు వద్దకు వెళ్లిన రైతులు చోరీ జరిగినట్లు గుర్తించారు. సుమారు రూ.2 లక్షల విలువైన తీగను చోరీ చేసినట్లు తెలిపారు. కాగా చోరీకి సంబంధించి తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పినపాక: మండల పరిధిలోని చింతల బయ్యారం వద్ద సోమవారం ఓ వ్యక్తి గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన జాలరులు వెంటనే అతడిని బయటికి తీసి కాపాడారు. కాగా ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

విద్యార్థిని ఆత్మహత్య

పాల్వంచ: ఈసెట్ ర్యాంక్ రాలేదని మనస్తాపంతో ఓ విద్యార్థిని సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ పట్టణంలోని వెంగళరావు కాలనీకి చెందిన గుగులోతు లలిత భర్త కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆమె కూలి పనులు చేస్తూ ఇద్దరు కూతుళ్లను సాకుతోంది. పెద్ద కూతురు ప్రియాంక(20) కరీంనగర్ జిల్లా పెద్దపల్లిలో మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా పూర్తి చేసింది. బీటెక్‌లో ప్రవేశానికి ఈసెట్ రాయగా, ఐదువేల ర్యాంక్ వచ్చింది. తక్కువ ర్యాంక్ వచ్చిందని మనస్తాపంతో బాధపడుతోంది. ఈక్రమంలో సోమవారం తల్లి కూలి పనులకు వెళ్లగా, ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేశారు.

మద్యానికి బానిసై మరొకరు..

పాల్వంచ: మద్యానికి బానిసై ఓ లారీ డ్రైవర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. ములకలపల్లి మండలం పూసుగూడేనికి చెందిన లారీ డ్రైవర్ సునావత్ ఓంకార్ (35) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. పనికి వెళ్లకుండా భార్య కుమారితో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని కుంటినాగులగూడెం సమీపంలో సమ్మక్క సారలమ్మ గద్దెల వెనుక మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. అనంతరం బంధువులకు ఫోన్ చేసి తెలపగా, వారు వచ్చేసరికి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి వీరమ్మ ఫిర్యాదుతో ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

పాల్వంచ: ఆన్‌లైన్‌లో పిల్లల లైంగిక వీడియోలు వీక్షించిన ఇద్దరు వ్యక్తులపై పాల్వంచ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. 2024 సంవత్సరంలో ఇద్దరు వ్యక్తులు ఆన్‌లైన్‌లో పిల్లల లైంగిక వీడియోలు (చైల్డ్ పోర్న్) వీక్షించారు. ఈక్రమంలో సైబర్ క్రైం అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



కుమారుడి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి

కరకగూడెం: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. పోలీసు ల కథనం ప్రకారం.. మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన బిలపాటి నరేందర్ (18) వరి పొలంలో మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. మెయిన్ లైన్ నుంచి వచ్చిన 2 కోర్ సర్వీస్ కరెంట్ వైరులోని ఓ సింగిల్ కోర్ వైరును న్యూట్రల్ వైరుగా భావించి.. పొరపాటున ఫేస్ వైరును పొలంలోని ఇనుప కంచె (ఫెన్సింగ్)కు తగిలించాడు. ఆ తర్వాత మోటార్ పైపును సరిచేసేందుకు ముందుకు వెళ్లగా ఫెన్సింగ్‌కు తాకి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దుర్ఘటనను గమనించిన స్థానిక రైతు ఇర్రి వెంకన్న ఫెన్సింగ్‌కు ఉన్న తీగలను తొలగించి పెనుప్రమాదాన్ని నివారించాడు. యువకుడి మృతితో తండ్రి రాంబాబు సొమ్మసిల్లి పడిపోయాడు. తల్లి మణెమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. మృతుడి సోదరుడు శ్యామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

- భద్రాద్రి జిల్లా వాసి మృతి

కొణిజర్ల: ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కొణిజర్ల ఎస్‌ఐ జి.సూరజ్ వెల్లడించిన వివరాలు... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం మామిడి గుండాలకు చెందిన ముక్తి భూపతి(38) ఓ ప్రైవేట్ బీమా కంపెనీలో పనిచేస్తున్నాడు. వైరాలో మార్కెటింగ్ ఏజెంట్ల శిక్షణ సోమవారం జరగగా ఆయన హాజరై తిరిగి ఇంటికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో కొణిజర్ల ఎంపీడీఓ కార్యాలయం సమీపాన ఆయన బైక్‌ను వెనక నుంచి కంటైనర్ లారీ ఢీకొట్టడమే కాక టైరు భూపతి పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాల పాలై ఘటనాస్థలిలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య తులసి, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. భూపతి సోదరుడు విజయ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి



తన్వితశ్రీ(ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీ పెద్దతండాలో సోమవారం విషాదం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం... పెద్దతండాకు చెందిన భూక్యాగోపి నాయక్, సరస్వతి దంపతులకు 26 నెలల కుమార్తె తన్వితశ్రీ, 8 నెలల బాబు తన్విష్ ఉన్నారు. చిన్నారి తన్వితశ్రీ పక్కన ఉన్న అమ్మమ్మ జ్యోతి ఇంటి ఆవరణలో ఆడుకుంటూ వెళ్లి నీటి తొట్టిలో పడింది. ఆ సమయంలో అమ్మమ్మ ఇంట్లో ఎవరూ లేరు. కొద్దిసేపటికి పాప కన్పించలేదని తల్లి, కుటుంబ సభ్యులు వెతకగా నీటి తొట్టిలో కన్పించింది. బయటకు తీసి స్థానిక గ్రామీణ వైద్యుడి తీసుకెళ్లగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యుడు తెలిపారు. చిన్నారిమృతితో తల్లిదండ్రులు, బంధువులు గుండెలవిసేలా రోదించారు. తన్వి శ్రీకి 8 నెలల తమ్ముడు తన్విష్ ఉన్నాడు. చిన్నారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రెజర్‌బాంబు పేలి గిరిజనుడికి తీవ్ర గాయాలు

చర్ల: మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు ఓ గిరిజనుడికి తీవ్రగాయాలైన సంఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో సోమవారం జరిగింది. ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధి పూజారికాంకేర్ స్కూల్ పారా ప్రాంతానికి చెందిన గిరిజనుడు కలుము గంగా సమీపంలోని అటవీ ప్రాంతంలో పశువులను మేపేందుకు వెళ్లాడు. పోలీసు బలగాలను మట్టుబెట్టేందుకు అడవిలో మావోయిస్టులను ఏర్పాటు చేసిన ప్రెజర్ బాంబును గమనించకుండా తొక్కడంతో పేలి కాలు నుజ్జునుజ్జయింది. సమాచారం తెలుసుకున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. క్షతగాత్రుడిని పోలీసు అంబులెన్సులో ఊసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గిరిజనుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.